క్లుప్తంగా

పరామర్శ



మాజీ సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: మండల పరిధిలోని కొంగగూడతండాకు చెందిన మాజీ సర్పంచ్ సీతారాంనాయక్ అనారోగ్యానికి గురై పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి బాధితుడిని పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. పరామర్శించిన వారిలో నాయకులు బాల్‌రాజ్‌గౌడ్, బస్వం ఉన్నారు.

సమస్యలు పరిష్కరించండి



డీఈకి వినతిపత్రం అందజేస్తున్న వార్డుసభ్యులు

కొత్తూరు: తమ వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ 6వ వార్డు కౌన్సిలర్ వీరమోని హేమ దేవేందర్‌ముదిరాజ్ డీఈ రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ వార్డు పరిధిలో భవానినగర్ కాలనీలో శిథిలావస్థకు చేరిన స్తంభాలు, కిందకు వేలాడుతున్న తీగలను సరిచేయాలని కోరారు. లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించడంతో పాటు అవసరమైన చోట విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి

ఏఈ హమునాయక్



విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

మొయినాబాద్: విద్యుత్ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని మొయినాబాద్ సబ్ డివిజన్ ఏఈ హమునాయక్ అన్నారు. విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా ఆదివారం మొయినాబాద్ సబ్ డివిజన్ కార్యాలయంలో ఫిర్యాదులు స్వీకరించారు. వినియోగదారులు పలు రకాల విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రాధాన్యత క్రమంలో విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులకు ఎలాంటి విద్యుత్ సమస్యలు వచ్చిన తమ దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు పత్తి కొనుగోలు కేంద్రం ప్రారంభం

షాద్‌నగర్: మండల పరిధిలోని చిలకమర్రి గ్రామంలో ఉన్న రాఘవేంద్ర కాటన్ కార్పొరేషన్ ఆవరణలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ప్రారంభిస్తున్న షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

'సదర్'ను రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయం

చేవెళ్ల: సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా గుర్తించడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు గణపురం తరుణ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో దీపావళి పండుగ సందర్భంగా యాదవులు నిర్వహించుకునే సదర్ ఉత్సవాన్ని రాష్ట్ర పండుగగా సీఎం రేవంత్‌రెడ్డి గుర్తించటం అభినందనీయమన్నారు. 70 సంవత్సరాల చరిత్ర కలిగిన సదర్ సమ్మేళనాల ఆత్మగౌరావాన్ని చాటి చెప్తుందన్నారు. రాష్ట్రంలో సంప్రదాయంగా ప్రతిఏడాది ఈ వేడుకలను జరుపుకోవటం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఇటీవల హైదరాబాద్‌లో సదర్ ఉత్సవాల్లో పాల్గొన్న సీఎం ఈ సంప్రదాయాన్ని గుర్తించి దీనిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారన్నారు. వచ్చే ఏడాది నుంచి గ్రామాల్లో సదర్ ఉత్సవాలను కలిసి మెలసి జరుపుకోవాలన్నారు. సదర్ పండుగను గుర్తించిన సీఎం రేవంత్‌రెడ్డికి గొల్లకురుమ యాదవులందరూ రుణపడి ఉంటారన్నారు.

పడకేసిన పశువైద్యం

- సిబ్బంది లేక మూతబడుతున్న వైద్యకేంద్రాలు
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశుపోషకులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఉత్తరాసిపల్లిలో మూతపడ్డ పశువైద్య ఉపకేంద్రం

కొందుర్గు: మండలంలో మూగజీవాలకు పశువైద్యం అందని ద్రాక్షలా మారింది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతో పాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడం లేదు. పశు వైద్యశాలల్లో గడిచిన పదేళ్ల కాలంగా ఖాళీ పోస్టులు భర్తీకి నోచుకోకపోవడం లేదు. దీంతో మూగజీవాలకు సరైన వైద్యం అందక మృత్యువాతపడుతున్నాయి. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. ఈ సారైనా పశుసంవర్ధక శాఖలో పోస్టుల భర్తీకి మోక్షం కలగకపోదా అని పాడిరైతులు ఎదురుచూస్తున్నారు.

మృత్యువాతపడుతున్న మూగజీవాలు

రైతులకు పాడి, పంట రెండు కళ్లలాంటివి. వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉండే పశువులను కంటికి రెప్పలా కాపాడుకుంటారు. రైతులు ప్రాణం కన్న ఎక్కువగా ఆశలు పెట్టుకొని సాదుకునే పాడి పశువులకు రోగం వస్తే చికిత్స చేసే దిక్కే లేదు. వేల రూపాయలు పెట్టి కొనుగోలు చేసిన పశువులకు సరైన వైద్యం అందక మృత్యువాతపడుతుండడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలి పశువులు మృతి చెందుతున్నా పట్టించుకునే పరిస్థితి లేదు. సీజనల్‌లో పశువులకు జబ్బు చేసినప్పుడు సకాలంలో వైద్యం అందటం లేదు. పశు వైద్యశాలల్లో సిబ్బందితో పాటు మందుల కొరత, ఆధునిక పరికరాలు లేకపోవడంతో మూగజీవాల పోషకులు ప్రైవేట్ ఆస్పత్రుల బాట పడుతున్నారు.

పశువైద్య కేంద్రాల వివరాలు

కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రాల్లో పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. అయితే ఈ కేంద్రాల్లో ఒక డాక్టర్, జేవీఓతో పాటు అంటెండర్ ఉండాలి. కాని కొందుర్గులో మాత్రమే ఒక వైద్యుడు ఉన్నాడు. చౌదరిగూడలో డాక్టర్ లేకపోవడంతో ఇతనే చౌదరిగూడ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. చౌదరిగూడకు సంబంధించిన డాక్టర్ మోహన్‌రెడ్డి జూన్‌లో చౌదరిగూడ డాక్టర్‌గా విధుల్లో చేరి ఒక నెల గడవకముందే హైద్రాబాద్ హెడ్ ఆఫీసుకు ఇన్‌చార్జిగా వెళ్లారు. ఉమ్మడి మండలంలో గోజాతి 15వేలు, గేదెజాతి 4 వేలు, గొర్రెలు 30వేలు, మేకలు 10వేలు ఉన్నాయి.

రైతుల ఇబ్బందులు

మండలంలోని ఉత్తరాసిపల్లి, శ్రీరంగాపూర్, జిల్లేడ్ చౌదరిగూడ మండలం పెద్దఎల్కిచర్ల పశువైద్య ఉపకేంద్రాలు సిబ్బంది లేకపోవడంతో మూతపడ్డాయి. దీంతో ఆయా ప్రాంతాల రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

మూసివేస్తే ఎలా..



గ్రామీణ ప్రాంతాల్లోనే అధికంగా రైతులు ఉంటారు. ఇక్కడి రైతులు వ్యవసాయంతో పాటు పశుపోషణ ప్రధాన వృత్తిగా నమ్ముకొని జీవిస్తున్నారు. కాగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పశు వైద్య కేంద్రాలను సిబ్బంది లేని కారణంగా మూసివేస్తే రైతులు ఏమిచేయాలి. కేంద్రాలు మూసివేస్తే పశువులను ఎక్కడికి తీసుకెళ్లాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, రైతు, ఉమ్మెంత్యాల

సిబ్బంది కొరతతోనే..



సిబ్బంది కొరత కారణంతోనే పశు వైద్య ఉపకేంద్రాలు మూతపడ్డాయి. అయినప్పటికీ ఏదైనా అత్యవసర సమయంలో తామె వెళ్లి పశువులకు వైద్య పరీక్షలు చేస్తున్నాం. ప్రభుత్వం సిబ్బందిని నియమిస్తే తప్పా సమస్య తీరదు. గత పదేళ్లుగా ఈ సమస్య కొనసాగుతూనే ఉంది.

– వెంకటేశ్, మండల పశువైద్యాధికారి

కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం



సంబురాల్లో పాల్గొన్న విద్యార్థులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం వసతి గృహ విద్యార్థులకు డైట్, కాస్మోటిక్ చార్జీలను పెంచిన సందర్భంగా ఆదివారం పట్టణ శివారులోని గిరిజన గురుకుల సంక్షేమ కళాశాలలో విద్యార్థినులు సంబురాలు నిర్వహించారు. హాస్టల్ విద్యార్థుల సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా థాంక్యూ సీఎం సార్ అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీతాపోలె, విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీని బలోపేతం చేయాలి

పార్టీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేశ్‌గౌడ్



పార్టీ సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న వెంకటేశ్‌గౌడ్, నాయకులు

చేవెళ్ల: గ్రామస్థాయిలో టీడీపీని బలోపేతం చేసేలా పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించాలని పార్టీ చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్ట వెంకటేశ్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి సభ్యత్వాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో మళ్లీ టీడీపీకి పూర్వ వైభవం తీసుకొచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. పార్టీ అధినాయకుడు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. పార్టీకోసం పనిచేసే నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపునిచ్చే విధంగా త్వరలోనే అన్ని కమిటీలను వేయనున్నట్లు తెలిపారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు పోటీచేసే విధంగా పార్టీ కృషి చేస్తోందన్నారు. త్వరలోనే పార్లమెంట్ పరిధిలో కార్యకర్తలతో సమావేశం నిర్వహించి పార్టీ సభ్యత్వ నమోదు చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పార్టీనే నమ్ముకొని ఉన్న నాయకులను తగిన ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ నాయకులు కె.సుభాన్‌గౌడ్, మానిక్యం, మల్లారెడ్డి, రాఘవ్, యాదయ్యగౌడ్, రాజుగౌడ్, మైహిపాల్, అరుణ్‌కుమార్, అశోక్, కృష్ణయాదవ్, నాగరాజు, నరేందర్ ఉన్నారు.

ఘనంగా సదర్ ఉత్సవాలు



ఉత్సవాల్లో దున్నపోతుల విన్యాసాలు

మొయినాబాద్: బ్యాండు మోతలు.. డీజే పాటల హోరు.. దున్నపోతుల విన్యాసాలతో సదర్ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. మండల పరిధిలోని సురంగల్‌లో అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో శనివారం రాత్రి సదర్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. దున్నపోతులతో విన్యాసాలు చేశారు. సదర్ ఉత్సవాల్లో గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరియాదవ్, నాయకులు సుందరయ్యయాదవ్, శ్రీనివాస్‌యాదవ్, నర్సింహాయాదవ్, జ్ఞానేశ్వర్ యాదవ్, జంగయ్యయాదవ్, అంజియాదవ్, శ్రీశైలం యాదవ్, భిక్షపతియాదవ్, రవియాదవ్, రాజుయాదవ్, విజయ్‌కుమార్‌యాదవ్, రాజేశ్‌యాదవ్, మల్లేశ్ యాదవ్, కృష్ణయాదవ్, రమేశ్‌యాదవ్, మహేందర్ యాదవ్, శ్రీనివాస్‌చారి, రాజు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బందికి సహకరించాలి

ఏడీ రమేశ్‌బాబు



చేవెళ్లలోని సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సమస్యలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

చేవెళ్ల: వినియోగదారులకు సంబంధించిన విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఏడీ కె.రమేశ్‌బాబు అన్నారు. మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఆదివారం విద్యుత్ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల సమస్యలపై అవగాహన, సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చేవెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న వినియోదారులకు సంబంధించి ఎమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరిస్తున్నట్లు చెప్పారు. ఎక్కువ బిల్లులు రావటం లేదా బిల్లులో తేడాలు ఉండటం, విద్యుత్ సరఫరాలో లైన్ సమస్యలు తదితర వాటిని ఈ కార్యక్రమంలో పరిష్కరిస్తామన్నారు. వినియోగదారులు సమస్యలు ఏమైనా ఉంటే విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సంప్రదించాలని చెప్పారు. విద్యుత్ సరఫరా, విద్యుత్ వినియోగం, ఆదా ఎలా చేసుకోవటంపై ప్రజలకు అవగాహన కల్పించారు. చేవెళ్ల సబ్ డివిజన్ పరిధిలోని చేవెళ్ల, షాబాద్ మండలాల పరిధి ప్రజలకు నిరంతరం విద్యుత్ అధికారులు అందుబాటులో ఉంటారని చెప్పారు. ఎలాంటి సమస్యలు ఉన్న వాటిని పరిష్కరించుకునేందుకు వినియోగదారులు ముందుకురావాలన్నారు. ప్రజలు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు నిరంతరం కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విద్యుత్ ఏఈలు కె.రాజేందర్, జీవీ కోటేశ్వర్‌రావు, విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బంది, లైన్‌మెన్‌లు, వినియోగదారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

ఏడీఈ సత్యనారాయణ



షాద్‌నగర్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న విద్యుత్ అధికారులు

షాద్‌నగర్: విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని ఏడీఈ సత్యనారాయణ అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి అధికారులు ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఏడీ సత్యనారాయణ మాట్లాడుతూ.. పట్టణంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో నెలకొన్న విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. ఏ చిన్న విద్యుత్ సమస్య వచ్చినా వెంటనే వినియోగదారులు స్థానికంగా ఉండే విద్యుత్ అధికారులకు, సిబ్బందికి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో ట్రాన్స్‌కో ఏఈ వినోద్, రూరల్ ఏఈ షణ్ముకరెడ్డి, ఏఏఓ సుమన్‌దేవ్ తదితరులు పాల్గొన్నారు.

కేశంపేటలో..

కేశంపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో ఆదివారం విద్యుత్ వినియోగదారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. సమస్యలను త్వరలో పరిష్కరిస్తామని అధికారులు వినియోగదారులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఈశ్వర్, సిబ్బంది జంగయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి విశేష స్పందన



తంగడపల్లిలో వైద్య శిబిరానికి హాజరైన గ్రామస్తులు

చేవెళ్ల: పేద ప్రజలకు ఉపయోగపడే విధంగా సత్యసాయి సేవా సమితి ద్వారా ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని తంగడపల్లి మాజీ సర్పంచ్‌లు అనూషసత్తయ్య, పర్మయ్యగౌడ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కిష్టయ్య అన్నారు. మండలంలోని తంగడపల్లిలో ఆదివారం హైదరాబాద్‌లోని శివం సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ వైద్యశిబిరానికి గ్రామంలోని ప్రజలు పెద్దసంఖ్యలో హాజరై వైద్యసేవలను సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామపెద్దలు సత్యసాయి సేవా సమితి సభ్యులకు సహకరించారు. గ్రామంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో మల్టీ స్పెషాలిటీ వైద్యసేవలు అందించారు. దంత సమస్యలు, స్త్రీ, శిశు విభాగం, కేన్సర్, గుండె వైద్యం, చర్మ, కంటి పరీక్షలు, ఆయుర్వేద వైద్యం, మూత్ర సంబంధ వ్యాధులు, చెవి, ముక్కు, గొంతుకు సంబంధించిన వ్యాధులు, మధుమేహం, ఎముకలు, కీళ్ల నొప్పులు తదితర వ్యాధులకు సంబంధించి వైద్యులు ఈ వైద్యశిబిరంలో పాల్గొని రోగులకు పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్య బృందం సభ్యులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



షాబాద్‌లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ అనురాగ్‌రెడ్డి

షాబాద్: గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని షాద్‌నగర్ బుగ్గారెడ్డి ఆస్పత్రి డాక్టర్లు అనురాగ్‌రెడ్డి, విజయ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 210 మంది వరకు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ కాంతారెడ్డి, ఎస్ఐ నవీన్‌రెడ్డి, నాయకులు రాజేందర్‌గౌడ్, రవీందర్, రాంచందర్, కృష్ణ, శ్రీనివాస్, నవీన్‌కుమార్, రాజేందర్, రాములు, సతీశ్, ఆస్పత్రి సిబ్బంది సురేష్, కిరణ్, ఫయాజ్, సాయి, చైతన్య తదితరులు ఉన్నారు.

అదుపు తప్పితే అంతే!

- రోడ్డుపక్కనే లేబర్ అడ్డా
- వాహనదారులకు తప్పని తిప్పలు
- ప్రమాదాలు జరిగినా కనీస చర్యలు చేపట్టని వైనం
- పట్టించుకోని అధికారులు



రోడ్డు పక్కనే కూరగాయాలు విక్రయిస్తున్న చిరువ్యాపారులు

కొత్తూరు: రోడ్లపై వేగంగా వెళ్లే వాహనాలు అదుపుతప్పి పక్కనే ఉన్న ప్రజలు, వాహనదారులను ఢీ కొట్టిన ఘటనలు పట్టణంలో పలుమార్లు చోటు చేసుకున్నాయి. ఈ ప్రమాదాల్లో పలువురు మృత్యువాత సైతం పడ్డారు. అయినప్పటికీ రోడ్ల పక్కన ప్రమాదాలు జరగకుండా సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. పట్టణంలోని పాత జాతీయ రహదారి నుంచి నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలతో పాటు ఇతర వాహనాలు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. దీనికి తోడు సమీపంలోనే ఉన్న దర్గా రోడ్డు గుండా సైతం భారీ వాహనాలు అధిక సంఖ్యలో తిరుగుతుంటాయి. కాగా పట్టణంలోని ప్రధాన పూలే కూడలీ వద్ద ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కూడళ్లలోనే వ్యాపారాలు

పట్టణంలోని పూలే కూడలీ కొత్తూరు–షాద్‌నగర్, కొత్తూరు జేపీదర్గా–పెంజర్లకు వెళ్లే ప్రధాన దారులకు అనుసంధానంగా ఉంది. కాగా ఈ రోడ్లకిరువైపులా నిత్యం ఉదయం వేళలో అడ్డా కూలీలు వందల సంఖ్యలో రోడ్డు మధ్యలోనే పనుల కోసం గుమిగూడుతున్నారు. సాయంత్రం వేళలో కూరగాయాలు, పండ్లు విక్రయించేందుకు చిరు వ్యాపారులు దుకాణాలను నెలకొల్పుతున్నారు. రెండు రోడ్ల నుంచి ఏదైనా వాహనాలు అదుపుతప్పితే నేరుగా దుకాణాలు, కూలీలపైకి దూసుకొచ్చే అవకాశం ఉంది. ఇదే జరిగితే ఇక్కడ పదుల సంఖ్యలో ప్రజలు, చిరు వ్యాపారులు మృత్యువాతపడడం ఖాయం. ప్రమాదకరంగా ఉన్న కూడళ్లలో వ్యాపారాలు చేస్తుండడంతో అటు వ్యాపారులతో పాటు అమాయక ప్రజల ప్రాణాలకు సైతం ముప్పు పొంచి ఉంది. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి ఉంటుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గతంలో ఓ లారీ అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకురావడంతో ఇద్దరు ప్రయాణికులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. పని కోసం వేచి చూస్తున్న ఓ కూలీని ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఢీ కొట్టడంతో కాలుకు తీవ్రగాయమైంది. దీనికితోడు కూలీలు రోడ్లపై గుమిగూడుతుండడంతో ట్రాఫిక్ జామ్ ఏర్పడి వాహనదారులు వారికి మధ్యన తరచూ ఘర్షణలు చోటు చేసుకుంటున్నాయి.



రోడ్డు మధ్యలోనే కారు ఆపి పనులు మాట్లాడుకుంటున్న కూలీలు

రోడ్డు పక్కనే కూరగాయాల విక్రయాలు

పట్టణంలోని దర్గా, పాత జాతీయ రహదారికి ఇరువైపులా పండ్లు, కూరగాయాల దుకాణాలను నిర్వహిస్తున్నారు. కొందరు రైతులు స్థలాభావం కారణంగా రోడ్డుపైనే దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. పట్టణం నుంచి షాద్‌నగర్, దర్గా రోడ్డు నుంచి వెళ్లే వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా దుకాణాలు, కొనుగోలు చేసేందుకు వచ్చిన ప్రజల మీదకు వెళ్లే ప్రమాదం ఉంది. స్థానికంగా పరిశ్రమలు ఉండడంతో ప్రతీ ఆదివారం పట్టణంలో వారంతపు సంత కొనసాగుతోంది. ఇక్కడ వందల సంఖ్యలో చిరువ్యాపారులు దుకాణాలను ఏర్పాటు చేయగా కార్మికులు తమకు కావాల్సిన సరుకులు కొనుగోలు చేస్తుంటారు.

అవగాహన కల్పిస్తాం



రోడ్లపై గుమిగూడి వాహనదారులు, ట్రాఫిక్ జామ్‌కు ఇబ్బందులు కల్పించకుండా అడ్డా కూలీలకు అవగాహన కల్పిస్తాం. అంతేకాకుండా రోడ్లపై నిలబడి ఇబ్బందులు లేకుండా వారికి ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపించడానికి కృషి చేస్తాం.

– నర్సింహారావు, సీఐ, కొత్తూరు